డాక్టర్. వి. సత్యనారాయణ




# ఈ తరం మనుషులు

రైల్వే స్టేషన్ ముందు రిక్షా ఆగింది.

బ్రీఫ్‌కేసుతో హడావుడిగా రిక్షా దిగి రైల్వే స్టేషన్‌లోకి పరుగెత్తాడు మూర్తి. ప్లాటుఫారం మీద మెయిలు కదలడానికి సిద్ధంగా ఉన్నట్టు అనౌన్సర్ ప్రకటించాడు. మూర్తి బుకింగ్ దగ్గరకు పరుగెత్తి టికెట్టు తీసుకుని ఉరుకులు పరుగులతో బండిలో ఎక్కి వూపిరి పీల్చుకున్నాడు మెయిలు పెద్ద రద్దీగా లేదు. మూర్తి ప్లాటుఫారం మీదకు చూశాడు. తన గుమ్మం తిన్నగా పుస్తకాల దుకాణం ఉంది.

దిగుదామా అనుకున్నాడు.

మెయిలు కూతవేసి కదిలింది.

'చైతన్యం' కొత్త సంచిక విడుదలయింది. దానిలో తను రాస్తున్న సీరియల్ పత్రిక వాళ్ళు ఎలా వేశారో! ఎన్ని కథలు అచ్చయినా ఎప్పటికప్పుడే ఆత్రుతగా అచ్చయిన కథను చూసుకోవాలనుంటుంది! నవ్వుకున్నాడు మూర్తి!

మూర్తి సీట్లు వెతుక్కుని ఒక సీట్లో కూర్చున్నాడు. మెయిలు పట్నం పరిహద్దులు దాటి వేగం పుంజుకుంది. మెయిలు చక్రాలు చేసే లయబద్ధమయిన శబ్దాలూ, గాలికోత, పట్టాల మీద రాపిడికి వచ్చే ప్రతిధ్వనీ తదేకంగా వింటూ దూరంగా వెనక్కి పరుగెత్తుకు పోతోన్న కొండలనూ, టెలిగ్రాపు స్తంభాలనూ చూడసాగాడు మూర్తి. కంగారుగా బయలుదేరడంలో బ్రీఫుకేసులో పుస్తకం పెట్టుకోవడం కూడా మరిచిపోయాడు. ఇంటిదగ్గర నుండి తొందరగా బయలుదేరమని ఉత్తరం వచ్చింది. ఆఫీసర్ ఏ కళ నున్నాడో చాల సులువుగా సెలవు దొరికింది. ఇల్లు మోహం చూసి ఏడాదయింది. అందుకే సెలవు దొరకగానే హడావుడిగా బయలుదేరి పోయాడు. ఇంట్లో పరిస్థితులు ఏమంత గాలివా కలిగించేవికావు. తన పెళ్ళి విషయమే ఇంట్లో నలుగుతోంది. తనకి సుశీలకి సాన్నిహిత్యం పెరుగుతోంది. సుశీల తను ఇంటికి రెండ ఇళ్ళ అవతల ఉంటోంది. ఇంటర్ ఫెయిలయి పెళ్ళికోసం ఎదురు చూస్తోంది. తన దృష్టిలో సుశీల మంచి అమ్మాయి. తనకి ఈడూ జోడూ. తన జీవితం సుశీలతో చెరి సగం చేసుకోవాలి. అదే తన ఆశ. అయితే అమ్మా నాన్నల దృష్టిలో సుశీలకి కులం లేదు. ఆమెతండ్రిది కులం, తల్లిదో కులం.

"అసలు మాకు కులంలేదు మొర్రో! మేం ఇద్దరమూ కులం సంకెళ్ళలోంచి బయటపడ్డాం" అంటారు సుశీల తల్లిదండ్రులు.

అయితే చుట్టుప్రక్కల ఉండే జిజ్ఞాసువులు వారిద్దరి కుల గోత్రాలు వెతికి పట్టుకునే వరకూ నిద్రపోలేదు.

ప్రస్తుతం తనకి 'సుశీలతో పెళ్ళి' అనేదే ఇంట్లో చర్చనీయాంశం! అందుకే తన కాళ్ళమీద తాను నిలబడే టంతవరకూ ఇంటికి పోలేదు.

సుశీల తనకోసం కాచుక్కూచుంది.

ఆ విషయం ఇంట్లోనూ తెలుసు.

తమ ఇద్దరి మధ్యా జరిగే ఉత్తర ప్రత్యుత్తరాల సారాంశాన్ని మోసుకు పోగల గూఢచారులూ ఉన్నారు.

తల విదిలించాడు మూర్తి.

తనలో తానే నవ్వుకున్నాడు. తనని ఎవరూ గమనించడం లేదు కదా అని చుట్టూ చూశాడు మూర్తి.

ఎదుటి సీట్లో కూర్చున్న యువకుడు పత్రిక చదువుకుంటున్నాడు. ప్రక్కసీట్లో వాళ్ళు దేశ రాజకీయాల్లో పార్టీ బలాబలాలు రాజకీయంగా కొనసాగుతున్న కప్పల తక్కెడ మేళాలను ఏకరవ ర్ణించు కుంటున్నారు. కిటికీ దగ్గర కూర్చున్న ముసలావిడ భోంచేసి వచ్చిందిలాగావుంది. కునికి పాట్లు పడుతోంది.

యువకుడు ఉన్నట్టుండి ఒళ్ళు విరుచుకుని ఒళ్ళో ఉన్న పత్రికను తీసి బల్లమీదకు విసిరికొట్టి "సస్పెన్సులో వదులుతారు సీరియల్ — మాయదారి పత్రికలు!" అన్నాడు చిరాకుగా.

మూర్తి బల్లమీద ఉన్న ప్రతిక కేసి చూశాడు. 'చైతన్యం' కొత్త సంచిక—వెతకబోయిన తీగె కాలికి తగిలింది. సభ్యత, కాదా అన్న విషయం ప్రక్కకి నెట్టి పత్రిక అందుకుని పేజీలు తిరగవేశాడు. సీరియల్ ఈసారి బొత్తిగా మూడు పేజీలే వేశారు.

కథానాయకుడి కులాంతర వివాహానికి తండ్రి ఒప్పుకుంటాడు. తల్లీ ఒప్పుకుంటుంది. హీరోయిన్ పరుగెత్తుకు వచ్చి, కథా నాయకుడితో 'శేఖర్!' నాకు నీతో పెళ్ళి ఇష్టం లేదు. క్షమించు!" అంటుంది. తరవాత ముక్క సశేషం!

ఆ యువకుడు మూర్తిని చూసి, "మీరు కూడా 'కడలి అంచున కాంతి చక్రం' సీరియల్ చదువుతున్నారా కొంపదీసి" అన్నాడు.

మూర్తి నవ్వి తలూపాడు.

"ఈ వారం చదివారా?"

"చదివినట్టే లెండి. ఏం?"

"హీరోయిన్ అలా శేఖర్ దగ్గరకు పరుగెత్తుకు వచ్చి అలా అనడానికి కారణం ఏమి టంటారు?"

"హీరోయిన్‌కి డాక్టర్ బావ ఉన్నాడు కదా! బావముందు ఆమె ఒకసారి భళ్ళున వాంతి చేసుకున్నది. బావ ఆమెను పరీక్ష చేశాడు. బహుశా ఏమైనా దీర్ఘవ్యాధి కానీ, నయంకాని వ్యాధి కానీ ఆమెను పట్టి పీడిస్తున్నట్టు పరీక్షలో తేలిందేమో! అందుకే ఆమె తన ప్రేమను త్యాగం చేసుకుని ఉంటుంది. ఏమైనా వచ్చేవారం చదువుతాం కదా."

"అవుననుకోండి. అయితే 'కడలి అంచున కాంతి చక్రం' అంటే ఏమిటంటారు?"

"సింపుల్. సముద్రం చివర కనిపించే కాంతి చక్రం—సూర్యుడు."

"ఆ హెడ్డింగ్ ఎందుకు పెట్టినట్టు?"

"సముద్రం సమస్యలకు ప్రతీక అనుకుంటే సూర్యుడు ఆశకి ప్రతిరూపం. నవలలో వర్ణాంతర వివాహం—ఆశాజనకమైన ప్రగతిని కోరి ఉండాలి రచయిత."

"థాంక్యూసార్! చాలా అనుమానాలు తీర్చారు." ముసలావిడ మూర్తికేసి చూసింది.

"బాబూ! ఏమీ అనుకోకుంటే ఒక మాట! కడలి అంచున కనిపించే టప్పుడు సూర్యబింబం ఎర్రగా ఉంటుంది. ఎరుపు విప్లవానికి ప్రతిబింబం అంటారు మీలాంటి యువకులు. విప్లవంలో నమ్మకం ఉందా రచయితకి? విప్లవంకోసం వర్ణాంతర వివాహాన్ని సాకుగా తీసుకుని నవల రాశాడా? చెబుతారా?" అన్నది ముసలావిడ.

"ఆమె మా నాయనమ్మ లెండి. తన చిన్నతనంలో చాల రచనలు చేసింది. పత్రికల వాళ్ళు వేసుకోలేదు" అన్నాడు యువకుడు.

మూర్తి ఆమెకి నమస్కారంచేసి "చాలాసంతోషం. మీ పేరు?" అడిగాడు.

"సరస్వతమ్మ అంటారు బాబూ!"

"ఏ రచనలు చేసే వారు?"

ఆమె చెప్పింది.

"మా నాయనమ్మ ప్రశ్నకి మీరు సమాధానం చెప్పనేలేదు!" అన్నాడు యువకుడు.

మూర్తి నిట్టూర్చి—"ఏ అభ్యుదయ పంథా అయినా విప్లవానికి దారితీయాలి. ఏ విప్లవమైనా సరే కొంత బీభత్సం ఏర్పడి తీరుతుంది. ఆ బీభత్సానికి ప్రతీకే ఎరుపు. బీభత్సం తర్వాతనే ప్రశాంతమైన పరిస్థితులు నెలకొంటాయని చరిత్ర చెబుతోంది" అన్నాడు.

"మీరే ఆ సీరియల్ రాస్తున్నట్టు మాట్లాడుతున్నారు మాస్టారూ!"

"నేనే!"

యువకుడు నోరావులించి చూశాడు. సరస్వతమ్మ కళ్ళు విప్పుకు చూచింది.

"నిజమా బాబూ! మీరేనా కథలు రాసే మూర్తిగారు!" ఆశ్చర్యంగా అడిగింది సరస్వతమ్మ.

"అవును మామ్మగారూ!"

"నమ్మలేక పోతున్నాను బాబూ! మీకు నిండా పాతికేళ్ళు ఉండవు. ఈ వయసులోనే ఇన్ని కథలూ, సీరియల్ నవలలూ రాశారా?" అడిగింది సరస్వతమ్మ."

"నా కంటె చిన్న వయస్సులోనే రాసినవాళ్ళున్నారు."

"రాసేవాళ్ళున్నారు. కాని మీ రచనల్లో పరిణతి ఉంటోంది బాబూ! మూర్తిగారంటే నలభై పైబడిన వయసు ఉంటుం దనుకునేవాళ్ళం!"

మూర్తి వినయంగా చూశాడు.

"మీ రెక్కడ పనిచేస్తున్నారు సార్. మిమ్మల్ని కుసుకోవడం చాలా సంతోషంగా ఉంది."

మూర్తి చెప్పాడు.

విశాఖపట్నంలోనా! మా మామయ్య కూడా అక్కడే కోరమండల్‌లో పనిచేస్తున్నాడు.

"'బాబూ! మీ 'తల్లి మనసు' కథ మాత్రం వాస్తవానికి చాల దగ్గరగా ఉంది. నిజం చెప్పుకోవాలంటే ఆ కథ మా ఇంట్లో అందరినీ ఆకర్షించింది బాబూ."

"ఆకర్షించడం ఏమిటి నాయనమ్మా! బావ ఆ కథ వల్లనే కదా మారాడు" అన్నాడు ఆ యువకుడు.

"అవును బాబూ. కట్నం కొంత ఇవ్వవలసి ఉంటే మా మనవరాలిని పండగ పేరు చెప్పి పుట్టింటికి తరిమేసే వాడు. మా అబ్బాయి దాని పెళ్ళిచేసి గొప్పలకు పోయి చాల ఋణ బాధల్లో పడిపోయాడు. బకాయి పడిపోయిన కట్నం బాపతు సొమ్ము తెచ్చి ఇవ్వలేక కుమిలిపోయేవాడు. ఆ సమయంలో మీ కథ కటింగు మా రామం—అంటే వీడే దాని మొగుడికి పంపించాడు. ఆ కటింగు అందుకున్న వెంటనే మనవరాలిని రమ్మని టెలిగ్రాం పంపించాడు అతగాడు." సరస్వతమ్మ కళ్ళు నీళ్ళతో నిండాయి.

మూర్తికి గర్వంగా ఉంది.

తన కథ వ్యక్తుల మీద ఇంత ప్రభావం చూపిందా? ఆశ్చర్యం తన కథలు కేవలం సాహిత్య పరంగానే కాకుండా వాస్తవ జీవితంలో సమస్యల పరిష్కారానికి కూడా దారి చూపుతున్నాయా? అయితే ఫరవాలేదు. తన సాహిత్యాని కో పరమావధి లభించిందన్నమాట.

తన 'తల్లి మనసు' కథలో పండగకి పుట్టింటికి వచ్చిన కూతురే తన పెళ్ళికి చితికిపోయిన తలిదండ్రులకు బట్టలు పెడుతుంది. మధ్య తరగతి కుటుంబాల్లో ఉండే గుప్తమైన అనురాగాలకు తను ఆ కథలో ప్రాధాన్యం ఇచ్చాడు.

సరస్వతమ్మ లేచి మూర్తి ప్రక్కకి వచ్చి కూర్చుండి అతడి చేతులు పట్టుకున్నది.

---

**డబ్బు సంపాదించడానికి విపరీతంగా శ్రమించాలి సంపదను కాపాడుకొనడానికి నిరంతరం భయపడుతుండాలి. ఆ సంపద పోయినప్పుడు అంతులేని ఆవేదనకు గురికావాలి.**

—లాటిన్ సూక్తి

---

## 2

మెయిలు రాజమండ్రి స్టేషన్లో ఎప్పుడు వచ్చి ఆగిందో ముగ్గురికీ తెలియదు. అంత గాఢంగా సంభాషణల్లో మునిగిపోయారు. ముగ్గురికీ సాహిత్యం అంటే ఉన్న అభిరుచి ముగ్గురినీ బాగా దగ్గరచేసింది.

"నాయనమ్మా! మన స్టేషన్ వచ్చింది" అన్నాడు రామం.

"బాబూ మూర్తీ! విజయవాడ రేపు ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళవచ్చును. రండిబాబూ! మా ఇంటికి వెళ్దాం" అన్నది సరస్వతమ్మ.

మూర్తి ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. రైలులో కలిసిన తమ స్నేహం రైలులోనే విడిపోతుం దనుకున్నాడు.

"అడ్రసు తీసుకుంటాను. తర్వాత ఎప్పుడయినా వస్తాను లెండి. మీ ఆదరానికి ఏం చెప్పాలో తెలియడం లేదు." మూర్తి తరడబడ్డాడు.

"నా మాట కాదనకండి బాబూ! అబ్బాయి మిమ్మల్ని చూస్తే వదిలిపెట్టడు. రండిబాబూ! మా ఇంటికి మీరు కొత్తకాదు. మీ కథలతో మా ఇంటిల్లపాదికీ పరిచయం ఉంది. అభిమానం ఉంది" బలవంతపెట్టింది సరస్వతమ్మ.

రామం కళ్ళు మెరుస్తోండటం మూర్తికి మరింత సంతోషపరిచింది.

తనని అభిమానించే వారింటికి వెళ్తున్నాననుకునే కంటే ఏ మాత్రం పరిచయంలేని కొత్త ఇంట్లో తను ఒక రోజు గడపబోతున్నాడు. ఆ థ్రిల్ ఎలా ఉంటుందో అనుభవించా లనిపించింది మూర్తికి.

మూర్తి సంతోషంగా ఒప్పుకున్నాడు.

ముగ్గురూ ఆటో ఎక్కారు.

ఇల్లు చేరేటప్పటికి సాయంకాలం అయిపోయింది.

## 3

సాయంకాలం అయిపోయింది.

సీతాపతి ఉసూరుమంటూ ఇంటి కొచ్చాడు. పార్వతి గబగబ బయటికి వచ్చింది. ముసలితనం మీద బడలిక తెచ్చిన ఒగర్పుతో అరుగు మీద నడుం వాల్చాడు సీతాపతి.

"ఏమండీ!" అన్నది పార్వతి.

సీతాపతి నిర్లిప్తంగా రోడ్డుకేసి చూశాడు.

"ఎక్కడ దొరుకుతుందే నీ పిచ్చిగాని! ఆ దుర్భాగ్యురాలు లేచిపోయుంటుంది" కోపంగా అన్నాడు సీతాపతి, లేచి సత్తువ తెచ్చుకుంటూ.

పార్వతి గుడ్ల నీరు కక్కుకుంది.

అసలు వాడు మన పక్కింట్లో దిగినప్పుడే నిన్ను హెచ్చరించాను. నీకు నా మాట ఏ దైనా చెవికెక్కి ఏడ్చితేకదా! మన బంగారం మంచిదైతే చాలదా! అన్నావు నిర్లక్ష్యంగా. ఇప్పుడు చూడు. కొంపలంటుకున్న తర్వాత వగచి ఏం లాభం?" అరవ సాగాడు సీతాపతి.

పార్వతమ్మ ఎదురుగాలికి ఎదురు తిరగడం నేర్చుకోలేదు. అందుకే మౌనంగా విని ఊరుకుంది.

సీతాపతికి అడ్డు లేకుండా పోయింది.

"ఎడమగా దని యింటర్‌లో అనవసరంగా చేర్పించాను. కాలేజికి వెడుతూం దనుకున్నాను కాని

ఇలా ప్రేమ పాశాల్లో పడిందని ఊహించ లేక పోయాము. నేనో చవటని. అందరూ నాలాగా పత్తి కాలం మనుషులే ఉంటారనుకుంటాను. అయినా నీకు ఈ విషయం వారం రోజుల క్రితమే తెలిసి ఇప్పుడు నువు నాకు చెప్పి ఏడవద్దూ! ఇంతకీ నిన్నని ఏం లాభం! నా ప్రారబ్ధం!"

పార్వతమ్మ ఏడవసాగింది.

"నువ్వు ఎందుకు ఏడవడం? అన్ని ఏడుపులూ అనుభవించడానికి నే నున్నాను కదా!"

పార్వతమ్మ ఏడుపు ఆపలేదు.

"సీతాపతీ! సీతాపతీ!" పిలుస్తూ వస్తూ మెట్లు దిగాడ కామేశ్వరరావు.

సీతాపతి తలెత్తి చూశాడు.

"అన్నయ్యా!" అంది పార్వతి గొల్లుమంటూ.

"ఏమయిందమ్మా. ఎందుకు ఏడవడం? మీ అమ్మాయి గురించి చెప్పడానికి వచ్చాము" అన్నాడు కామేశ్వరరావు.

ఆ సమయంలో కామేశ్వరరావు పొరుగింటి వాడిగా కాక ఆపద్బాంధవుడి లాగా కనిపించాడు.

"అమ్మాయి కనిపించిందా?" సీతాపతి దంపతులు ఒక్కసారిగా అరిచినంత పని చేశారు.

"అవును. పని మీద నేను రేవు దాటి రాజమండ్రి వెళ్ళాను. కోట గుమ్మం దగ్గర ఎవరితోనో మలుపు తిరుగుతూ రోడ్డు మీద కనిపించింది. అతడు మా ఇంట్లో అద్దెకి ఉంటూన్న కుర్రాడే."

"మరి. వాళ్ళని వదిలి పెట్టేశావా అన్నయ్యా!"

"లేదమ్మా. వాళ్ళ వెనకే నడిచాను. నన్ను గమనించి నట్టున్నారు. చిన్న సందులోకి వేగంగా మలుపు తిరిగి మాయమయ్యారు. నేను అటూ ఇటూ ఆ సందులో తిరిగాను కాని వాళ్ళు మరల కనిపించ లేదు."

"ఏమండీ! ఇంకా చూస్తారేం? అన్నయ్యగారిని తీసుకుని త్వరగా వెళ్ళి రండి."

"ఏడిచింది! పనికి మాలినది! చీకట్లో ఎలా వెతతాం? రాజమండ్రి ఎంత పట్నమైనా రాత్రి వెళ్ళి చేసేదేం ఉంది!'

"అలా అనకండి. మీ పిన్నిగారుంటారు కదా! వాళ్ళ పిల్లలతో కలిసి వెతకండి. లేకపోతే దాని బతుకు నాశనమై పోతుంది!" అంది పార్వతమ్మ.

సీతాపతి కామేశ్వరరావు కేసి పాలిప్రాయంగా చూశాడు.

## 4

మూర్తికి ఆ ఇంట్లో పరాయి ఇల్లు అనే భావన కలగనం లేదు. అందరూ ఆప్యాయంగా పలకరిస్తు న్నారు. ఏం కావాలో మరీ మరీ అడిగి చేస్తున్నారు. మూర్తిని కాలు కదప నివ్వడం లేదు. రాత్రి భోజనాల దగ్గర అయితే సరస్వతమ్మ ఒక పక్కా, ఆమె కొడుకు రెండో పక్కా పోటీలు పడి మూర్తి విస్తట్లోకి పదార్థాలు గుప్పించి మరీ ఇబ్బంది పెట్టారు.

భోజనాలవుతుండగా వీధి గుమ్మం తప్పు డయింది. సరస్వతమ్మ వెళ్ళి తలుపు తీసింది.

"అరె! సీతాపతీ! నువ్వా!" అంది సరస్వతమ్మ.

సీతాపతీ, కామేశ్వర్రావూ లోపలికి అడుగు పెట్టారు,

"రండి. కాళ్ళు కడుక్కోండి. భోజనం వడ్డిం చేస్తాను" అంది సరస్వతమ్మ.

సీతాపతినిర్లిప్తంగా, "భోజనం చేసే బయలు దేరాం పిన్నీ! ఇప్పుడు కంగారు పడక! మీ పనులు ముగించు కోండి. చెప్పవలసింది చాలా ఉంది." అన్నాడు బాత్‌రూమ్ కేసి నడుస్తూ. కామేశ్వరరావు అతడిని అనుసరించాడు.

* * *

"అదీ సంగతి అన్నయ్యా! అమ్మాయి ఇంటర్ చదువుతూందనే అనుకున్నాను కానీ క్లాసు పుస్త కాల్లో నవలలు పెట్టుకొని చదువుతూందనీ, పక్కింటి వాడితో ప్రేమకలాపాలు జరుపుతూందనీ, గుర్తించలేకపోయాను. మీ ముందు లోక అయో మయం! నీకు తెలియని దేముంది? ఇక్కడే కోట గుమ్మం దగ్గర సాయంకాలం కనిపించారట!" అన్నాడు సీతాపతి.

"ఆ అబ్బాయి ఎవరు?" అడిగాడు రాఘవయ్య, సరస్వతమ్మ కొడుకు.

# నా భావాలు

నా భావాలు
సాగరంలో నీటి చుక్కలు
ఒక్కటొక్కటే
మహార్ణవమై పొంగుతాయి

నా భావాలు
పాల పిటల గుంపులు
హాయిగా రెకలు విప్పుకుని
ఆకాశంలో విహరిస్తాయి.

నా భావాలు-
సంజెలోని వెండిమబ్బులు
నీలి చీర మీది జలతారు పువ్వులా
తళుక్కు మంటాయి.

నా భావాలు-
సముద్ర గర్భంలోని నాచుమొక్కలు
గుబురు గుబురుగా పెరిగి
భావల చేపల ఆహారమై నిలుస్తాయి.

నా భావాలు-
ప్రళయాగ్ని కీలికలు
గుప్పున ఆవేశంతో మండి
అన్యాయాలను ఆహుతి గొంటాయి.

నా భావాలు-
సముద్ర తీరంలో విరిగి పడే అలలు
తెలి మరగలాటి జ్ఞాపకాలను మిగిల్చి
వెనక్కు నిశ్శబ్దంగా మళ్ళిపోతుంటాయి.

**కోడూరి దుర్గానాగరాజు**

దూరంగా మూర్తి మంచం మీద పడుకుని వినసాగాడు. కొత్త స్థలం కావడంతో ఒక పట్టాన నిద్ర రావటం లేదు.

"సుబ్బారావు అని మంచి కుర్రవాడే! రైల్వేలో టెంపరీగా పని చేస్తున్నాడు. రెండు వందలు ఇస్తారు కాబోలు! దానితో సంసారాన్ని ఎలా పోషి స్తాడు?" సీతాపతి గొంతులో దుఃఖం పొర తెగి క్షణం క్షణం అడ్డు వస్తూ ఉంది.

రాఘవయ్య కళ్ళు మూసుకుని ఆలోచించ సాగాడు. మూర్తి ఉలిక్కిపడ్డాడు.

సుబ్బారావు ? తన స్నేహితుడు సుబ్బా రావేనా? తిరుగు ప్రయాణంలో వాడిని కలుసు కోవాలని కూడా అనుకుంటున్నాడు. వాడూ రైల్వే లోనే పని చేస్తున్నాడు.

"అమ్మాయినీ, సుబ్బారావునూ పట్టుకుంటే.... ఏం చేద్దామని నీ ఆలోచన !" అడిగాడు రాఘ వయ్య.

"ఏం చేస్తానా? వాడిని ముక్కు పిరగదన్ని అమ్మాయిని తెచ్చుకోమా?" సీతాపతి పెడ బొబ్బలు పెట్టాడు.

"దానివలన ప్రయోజనం ఏమిటి?"

"ఏమిటా? అన్నయ్యా ! ఏమిటలా మాట్లాడు తున్నావు?

"వాళ్ళిద్దరినీ విడదీసేకంటే మనం చేరదీసి పెళ్ళి చేయడం ఉత్తమం?"

"ఏమిటి? కులాంతరమా?"

"తమ్ముడూ ! ఆలోచించు. కులంలో ఇక పనేముంది ? అమ్మాయి ఇష్టపడింది—చాలదా?"

"దాని మొహం. దానికో ఇష్టమా? దాని ఇష్టం దానికి తెలుసా?" సీతాపతి ఆవేశంగా అరిచాడు.

"తెలియకుండా ఆ అబ్బాయిని ప్రేమించి అతడితో స్వతంత్రంగా వెళ్ళిపోగలిగిందా?"

"అన్నయ్యా! నువు మాట్లాడేది నాకు అర్థం గావడం లేదు. ఆ భ్రష్టను వెనకేసుకొస్తావేం?"

"తమ్ముడూ! కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. ఆవేశపడక!"

"నువ్వనేదేమిటి? ఈ పెళ్ళికి చచ్చినా ఒప్పుకోను."

"ఏమీ అనుకోవద్దు. లేచిపోయినట్టు బిరుదు తెచ్చుకున్న అమ్మాయిని ఎవరు చేసుకుంటారు?"

"చేసుకోనట్టయితే ఇంట్లో పడి ఏడుస్తుంది. దానికి అమాత్రం ముద్ద పడవేయలేమా?"

"ఎంతకాలం అలా చేయగలవు? ఆడపిల్లని అత్తింటికి పంపితే ఆనందమా? ఏ కొన్ని కాలమూ పోషించడం ఆనందమా! ఆలోచించు. మరీ సినిమాల్లో పుస్తకాల్లో తండ్రిలాగా ప్రవ ర్తించకు! మారే కాలంతో పాటు మనమూ మారాలి."

"మారతాం... మారతాం... బాగానే మారతాం! అది సినిమాలు చూసి, నవలలు చదివే అలా మారింది."

"సినిమాలూ, నవలలూ చదివితేనే మారి పోతుందా?" విడ్డూరంగా అడిగాడు రాఘవయ్య.

"ఆఁ! ఆఁ! అదేదో పత్రికలకి సీరియల్ నవల చదివే అమ్మాయి మారిపోయింది. నువ్వు నమ్మక పోతే నేనేం చేసేది?"

"సీరియల్ నవలా? ఏ సీరియల్ బాబాయ్?" అడిగాడు రామం.

"ఎవడో మూర్తట! కలల అంచుల్లో.... కొంతులో....ఏదో ఆ పేరు కూడా వాంతొచ్చేంత! అది చదివే నాశనమైపోయింది దాని బతుకు!"

'నవలను కాలక్షేపానికి చదువుకుంటాం గానీ, ఆమాత్రానికే అది మన బతుకులను మార్చేస్తుందా! ఏమిటి బాబాయ్!"

"అవును రామం! ఆ మూర్తి గొప్ప రాతగాడి ననుకుంటాడో ఏమిటో. అతగాడి రాతలనిండా పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళిళ్ళు చేసుకోవద్దనీ, కులాంతర వివాహాలు చేసుకోమనీ వీలుంటే లేచి పొమ్మనీ సలహాలు ఇస్తాడట! వాడి రాతలను గొప్పగా పొగిడేదిలే! అసలు తనుండేది ఎక్కడ? ఆ పత్రికాఫీసుకి కూడా రాశాను—వాళ్ళు జవాబు రాయలేదు".

మూర్తి నిశ్చేష్టుడై పోయాడు. మంచంమీద పండుకునే వాళ్ళకేసి చూడసాగాడు.

"నీ పిచ్చిగానీ తమ్ముడూ! మూర్తిగారు రాసిన కథల్లో మంచే ఉంటుంది. మన అల్లుడి వ్యవహారం నీకు తెలుసుకదా! మూర్తిగారి కథ ఆయన చదివిన తర్వాతే మారాడు" అన్నాడు రాఘవయ్య.


## బెల్లే వ్యూ స్కూలు

( ఆం. ప్ర. ప్రభుత్వముచే గుర్తించబడినది )

మీరా టాకీస్ రోడు. ఖైరతాబాద్.

హైదరాబాద్ - 500 004

ఇది ఒక ఇంగ్లీషు మీడియం సహవిద్యా పాఠశాల. ప్రశస్తమైన హాస్టలు వసతులు కలవు. వ్యక్తి పరముగ ఈ స్కూలు నిపుణతతో కూడిన శిక్షణ ఇచ్చును. మనియార్డరు లేక క్రాస్ చేయబడిన పోస్టల్ ఆర్డరు ద్వారా రు. 5/—లు చెల్లించి ప్రిన్సిపాల్ గారి వద్ద నుండి ప్రాస్పెక్టసు, దరఖాస్తు ఫారము పొందవచ్చును. స్కూలు 12—6—1980 న తెరువబడును.




బ్రాంచి: 6/15 లైను, బ్రాడీపేట, గుంటూరు-2


"మరి కథలు మనుషులను మార్చవు అన్నావు."

"మంచిగా మారుస్తాయన్నాను."

"అల్లుడు అమ్మాయిని రమ్మని టెలిగ్రాం ఇచ్చిన సంగతి తెలిసినప్పటినించే నేనూ మూర్తి కథలు చదువుతున్నాను. అతడి కథల్లో అన్నీ వ్యతిరేకభావాలే."

"సరే! ఇప్పుడు ఇద్దరూ గొడవెందుకు: గానీ— అమ్మాయినీ అబ్బాయినీ వెతికాక తర్వాత సంగతి ఆలోచిద్దాం!" అన్నాడు రాఘవయ్య.

"అలా అన్నావు బాగుంది!" అని సీతాపతి ఆవులించాడు.

మూర్తి నిట్టూర్చాడు.

రాఘవయ్య, సీతాపతి, కామేశ్వరరావు తయారై బయటకు నడిచారు.

వాళ్ళు ఉసూరుమంటూ అర్ధరాత్రి దాటాక ఇంటికి తిరిగి వచ్చేవరకూ మూర్తికి నిద్రపట్టలేదు.

ఇంకా పూర్తిగా తెల్లవారకుండానే మూర్తి బట్టలు వేసుకుని బయటికి బయలుదేరాడు. సరస్వతమ్మ ఇంటిపనుల్లో ఉండి అంతగా పట్టించుకోలేక పోయింది మూర్తిని.

ఆరు గంటలకు గానీ రాఘవయ్య లేవలేక పోయాడు. రాత్రి చాలసేపు తిరగడం వలన ముగ్గురికీ ఒళ్ళు పట్టేసింది. సీతాపతిని నిద్రలేపాడు రాఘవయ్య. కామేశ్వరరావు అప్పటికే లేచి కూర్చున్నాడు.

"ప్రేమికులు మనకు చాలా తలనొప్పిగా తయారయారు. రాత్రంతా వృథాగా తిరిగాం" అన్నాడు రాఘవయ్య.

"లాడ్జీలు తిరిగాం. అసలు కామేశ్వరరావు ఎవరిని చూచి ఎవరనుకున్నాడో! లేపోతే వాళ్ళు ఇంత ప్రక్కనే ఉన్న రాజమండ్రిలో లేరా మన వెర్రి కానీ ..." సీతాపతి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. కోపంతో బొంగురుపోయింది.

"అదే చిత్రం! చాలా అద్భుతంగా మాయమయ్యారు. నేను చూసింది మన అమ్మాయినే, ఆ అబ్బాయినే. నా కళ్ళు నన్ను మోసం చేయలేదు" అన్నాడు కామేశ్వరరావు.

"ఇంతకీ నా కర్మ! కృష్ణా రామా అనుకునే వయసులో నాకీపాట్లు తెచ్చిపెట్టింది. చిన్న కూతుర్ని ముద్దు చేసి అనుభవిస్తున్నాను" నిట్టూర్చాడు సీతాపతి.

"లేచి ముఖాలు కడుక్కోండి. కాఫీ తాగుదురు గానీ" అంది సరస్వతమ్మ.

ముగ్గురూ లేవబోయారు.

గుమ్మం దగ్గర ఎవరో నిలబడ్డట్టుంటే రాఘవయ్య తల తిప్పి చూశాడు. మూర్తి! అతడి వెనక సీతాపతి కూతురూ, కొత్త యువకుడూ నిలబడి ఉన్నారు. రాఘవయ్యకి కలో నిజమో అర్థంకాలేదు. గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు.

సీతాపతి రంకెలు వేయసాగాడు. జారిపోతున్న పంచెను ఎగ్గట్టుకుంటూ కూతురి మీదకెళ్ళాడు. "దిమ్మరిముండా! మేమంతా చచ్చాం అనుకున్నావా? మన కుటుంబం ఎలాంటిదనుకున్నావ్? నీకు పెళ్ళి ఎలా అవుతుంది?"

"ఆగండి!" అరిచాడు మూర్తి చెయ్యి గుమ్మానికి అడ్డం పెట్టి.

సీతాపతి అతడిని విడ్డూరంగా చూశాడు. అతడిలో ఇంగితం మేల్కొన్నది. అతడెవరు? వీళ్ళిద్దరూ ఇక్కడికి ఎలా రాగలిగారు? అతడు వెతికి, వాళ్ళను తీసుకువచ్చాడా? అతడికీ వాళ్ళకీ సంబంధం ఏమిటి?

"మీరెవరు?" అడిగాడు సీతాపతి.

రాఘవయ్య "ఆయన ..." అని ఆగిపోయాడు. మూర్తి వద్దన్నట్టు కళ్ళు మూశాడు.

"నేను ఎవరినైతే మీకేం? మీ అమ్మాయీ ఆమె కోరుకున్న అబ్బాయి మనకి దొరికారు. వాళ్ళకి పెళ్ళిచేసి మీ మర్యాద నిలబెట్టుకోండి."

"నువ్వెవరయ్యా ఆ విషయం చెప్పడానికి?"

"వాళ్ళ శ్రేయస్సు కోరే వాడిని. సుబ్బారావు నా స్నేహితుడు. రాజమండ్రి వస్తే అతడు ఎక్కడ బస చేస్తాడో నాకు తెలుసు. అందుకే రాత్రి మీ సంభాషణ విని ఉదయాన్నే వెళ్ళి సుబ్బారావునీ మీ అమ్మాయినీ ఒప్పించి తీసుకువచ్చాను."

రాఘవయ్య కలగచేసుకున్నాడు.

"అవునురా తమ్ముడూ! మూర్తిగారు చెప్పినట్టు చెయ్యి. ఇంత జరిగాక మన అమ్మాయిని చేసుకునేవాడెవడు? ఆలోచించు."

సీతాపతి తల పట్టుకున్నాడు.

"సీతాపతీ! మీ అన్నయ్యగారూ, మూర్తిగారూ చెప్పిందంతా విను. ఆవేశపడకు!" అన్నాడు కామేశ్వరరావు.

"మూర్తి గారా! అంటె ... వీరే కథలు రాసే నంగా చూశాడు.

"అవును తమ్ముడూ ... వీరే కథలు రాసే మూర్తిగారు"

సీతాపతి కోపంగా చూచి, "నువ్వు కథలు రాయడమే కాదన్నమాట! కులం గోత్రం లేని పెళ్ళిళ్ళు కూడా చేస్తావని కంకణం కట్టుకున్నావా నాయనా?" అన్నాడు.

మూర్తి నిదానంగా చూచి, "సీతాపతిగారూ! కాలం మారుతోంది. మనుషులు మారుతున్నారు. వారి ఆలోచనల్లో రోజు రోజుకీ ఎన్నో వింత మార్పులు వస్తున్నాయి. ఇంకా ఏనాటివో సంకుచిత భావాలు పట్టుకుని వ్రేలాడేకంటె మారేకాలంతో మనమూ మారితే ఈనాటి మనుషులకు మనం దూరం కానక్కరలేదు. బాగా ఆలోచించండి. సుబ్బారావు మేజర్. మీ అమ్మాయి మేజర్. ఇద్దరూ కలిసి పెళ్ళి చేసుకుంటామంటే అభ్యంతరం పెట్టడానికి ఎవరికీ హక్కులేదు. వాళ్ళిద్దరికీ, పెళ్ళిచేసి మీ పెద్దరికం నిలబెట్టుకుంటే మంచిది' అన్నాడు.

"లేకపోతే..!"

మూర్తి జాలిగా చూశాడు.

"నా ప్రాణాలయినా ఒడ్డి ఇద్దరి పెళ్ళి చేస్తాను. మీరు గుడ్లప్పగించి చూస్తారు. అంతే!

సీతాపతి నోరావులించాడు.

రాఘవయ్య కామేశ్వరరావు మొహాలు చూసుకున్నారు.

* * *

సాన్నిహిత్యం కళ్ళు గర్వంగా చూస్తున్నాయి. దాసుం నిర్ఘాంతపోయాడు.

## 6

రైలు కదిలింది. రెండు కొవ్వూరు స్టేషన్ వదలి గోదావరి బ్రిడ్జిమీద అడుగు పెట్టింది. మూర్తి కెరటాలు లేని విశాలమైన నదిలోకి చూశాడు. పైకి కెరటాలు లేనట్టు కనిపిస్తోందే తప్ప నది తన ఒడ్డును ఒరుసుకుంటూ బ్రిడ్జి స్తంభాలను తాకుతూ నిరంతరం పారుతోనే ఉంది.

మూర్తికి కళ్ళు కలకబారినట్లయింది.

సమాజం చాలా సున్నితంగా ప్రగతిలోకి అడుగు పెడుతోన్నట్టే పైకి అనిపిస్తున్నది కాని సమాజం పొరల్లో ఎన్ని సుడిగుండాలు? ఈ సుడిగుండాల్లో ఎన్ని జీవితాలు అతలాకుతలా అవుతున్నాయో లెక్కకట్టేది ఎలా? ఆ ప్రయత్నానికి పూనుకునేది ఎవరు?

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది సుశీ.

మూర్తి తల తిప్పి చూశాడు. సుశీల! తన జీవితంలో పాలు పంచుకోవడానికి తనతోపాటు కలసి జీవిత ప్రయాణంలో ముందుకి నడవడానికి ఇంటినీ కుటుంబాన్నీ వదిలి వచ్చేస్తోంది.

ఇంట్లో తాను వూహించినట్టే గందరగోళం చెలరేగింది. అమ్మ ఒకవైపూ, నాన్న ఒకవైపూ తన భవిష్యత్తుకు ఉచ్చులు పన్ని ఉంచారు.

తన పెళ్ళిమీద వచ్చే కట్నంతో చిన్న చెల్లికి పెళ్ళిచేయాలని నాన్న పథకాలు వేస్తున్నాడు.

రాబోయే సాంప్రదాయపు సంబంధంతో తనకి జరగవలసిన మర్యాదలన్నీ జరిగి తీరతాయని అమ్మ కలలు కంటోంది.

ఆడపడుచు కట్నంకోసం పెద్దక్క, చిన్న చెల్లి బడ్జెట్లు తయారు చేసి ఉంచుకున్నారు.

సుశీల వీటన్నింటినీ గాలి దుమారంలా లేపేసి తనతోబాటు వచ్చేస్తోంది.

సుశీలకి పెళ్ళి చేయలేకపోయిన అసమర్థత వాళ్ళ నాన్న రంకెలు వేశాడు. అయినా తాము ఇద్దరూ కలసి ఆయనని ఎదిరించారు.

సగర్వంగా ఇద్దరూ సూట్‌కేసులు వెనుక తెచ్చుకుంటూ వీధి ఎక్కారు.

వీధి వీధి తమ వంక గ్రామాలను ధ్వంసం చేసే కిరాతకులను చూసినట్టు చూసింది. అయినా తమకేం లెక్కలేదు.

వీధిలోకి అమ్మ శాపాలుగా, ఏడుపులుగా వినిపిస్తున్నాయి. నాన్న అమ్మని పట్టుకు తిడుతూ తన కోపానికి కొత్త రంగు పులుముకుంటున్నాడు.

"ఏమిటి? జవాబు కూడా ఇవ్వనంత గాఢంగా ఆలోచనల్లో మునిగి తేలుతున్నారు" అన్నది సుశీల.

మూర్తి ఆమె చెయ్యి నొక్కాడు. సుశీలకి సుఖకరమైన భవిష్యజ్జీవితం ఆ స్పర్శలో వెచ్చగా తగిలి ఒళ్ళు ఝల్లుమన్నది. *




## లోకాన దొంగలు

ఓ జమీందారుగారు ఓ రోజు రాత్రి పేదలందరినీ పిలిచి వస్త్రదానం ఏర్పాటు చేశారు.

ఒక్కొక్కరే వచ్చి జమీందారుగారికి నమస్కరించి వస్త్రాలందుకుని వెళ్ళిపొతున్నారు.

ఉన్నట్టుండి ఎందుకో దీపాలారిపోయాయి. అంతా అంధకార బంధురమైపోయింది కొద్ది క్షణాలపాటు. మళ్ళా దీపాలు వెలిగాయి ఓ రెండు నిమిషాల తరవాత

ఉన్నట్లుండి ఎవరో గావుకేక వేశారు. 'జమీందారు గారి మనవరాలి మెళ్ళోని గొలుసు కనిపించటం లేదంటూ''

ఎవరికి వారు మొహాలు చూసుకున్నారు.

ఎవరు తీసుకున్నట్టు ?

ఎవరు దొంగలించినట్టు ?

గుసగుసలు బయలుదేరాయి.

అపుడు జమీందారుగారు అందర్నీ ఉద్దేశించి, "ఎవరో ఒకరు మనలోనే తీసివుంటారు, కాని అందరి ఎదుటా బయట పడి చెప్పుకోవటం కష్టసాధ్యం అందుకని, ఆ గొలుసు తీసుకొన్న దెవరో, వచ్చి ఈ పళ్ళెంలో గొలుసు జారవిడి చేయండి. నేనప్పుడు దీపా లార్పేస్తాను ఇలా లేని పక్షంలో అతిథి మర్యాదను భంగపరుస్తూ, అందర్నీ సోదా చేయాల్సి వస్తుంది" అని అందరూ చూస్తుండగా ఓ వెండి పళ్ళాన్ని ఎత్తుగా వేదిక మీద వుంచాడు!

ఆ తర్వాత దీపా లార్పేశారు.

రెండు నిముషాలు గడిచాయి.

అంతా చీకటి.

అందరూ ఊపిరి బిగపట్టుకుని, చెవులు నిక్కించి, కళ్ళు చిట్లించి చూస్తున్నారు.

"ఊ, రెండు నిమిషాలు గడిచాయి. నేను దీపాలు వెలిగిస్తున్నా" అని కేక వేశారు జమీందారుగారు.

దీపాలు వెలిగాయి

అందరి కళ్ళూ ఆత్రంగా వేదిక కేసి చూశాయి

అక్కడ ఉండాల్సిన వెండి పళ్ళెం కనిపించలేదు !

- మునీర్

## గుర్రం నకిలింపు

ఒకసారి అబునివాస్ అనే వర్తకుని దగ్గరకు పొరుగింటి అల్లాబక్షు వచ్చి "నీ గుర్రం ఒకసారి అరువు యివ్వు భాయీ! పట్నం వరకు పోయి వస్తాను" అని అడిగాడు.

"అయ్యో! ఏం చెప్పమంటావయ్యా! వద్దన్నా వినకుండా నా కొడుకు గుర్రాన్ని బయటకు తీసుకొని వెళ్ళాడు" అని బదులు చెప్పాడు. ఇంతలోనే లోన గుర్రపు కాలలో కటిన గుర్రం నకిలించింది.

"ఏం పెదమనిషివయ్యా! గుర్రాన్ని వుంచుకొనే లేదని అబద్ధం చెపుతావా" అని ప్రశ్నించే సరికి - "నీకు కావల్సింది నా గుర్రమా ? లేక దాని నకిలింపా? గుర్రం లేదంటే నమ్మవే! నీకు గుర్రం కావాలంటే అది ఇక్కడ లేదు. దాని నకిలింపు కావాలంటే తీసికొనిపో" అంటూ అబునివాస్ గుర్రం లాగ నకిలించుకుంటూ ఇంటిలోకి జారుకున్నాడు.

పొరుగింటి అల్లాబక్షు తెల్లబోయి ఇంటి ముఖం పట్టాడు.

అక్కాల బాబూరావ్